# చదువెందుకు

"కాలేజీకి వెళ్తున్నావా అమ్మా! ముందు బెంచీలో సీటు దొరుకుతుందో లేదో త్వరగా వెళ్ళమ్మా!"

ఎగతాళి - శంకరంగాడికి చదువు అంటే ఎగతాళి, విద్యపట్ల శ్రద్ధ చూపేవారంటే చులకన!

కొడుకువైపు మందలింపుగా చూసింది పార్వతి. పుస్తకాలు తీసుకుని వాకిట్లోకి వచ్చి అటూ ఇటూ చూసింది.

"శకునం చూసుకొంటున్నావా అమ్మా! నేను ఎదురు రానా పోనీ? ఫస్టుక్లాసు హామీ ఇస్తాలే!"ఎక్కడ పొంచి ఉన్నాడో కిష్టిగాడు హఠాత్తుగా ఊడిపడి అన్నాడు.

కిష్టిగాడు అన్నకన్నా రెండాకులు ఎక్కువే చదివేడు.

శంకరానికి చదువంటే ఇష్టం లేదు కాని, చదివితే వంటబడుతుంది. కిష్టిగాడు వట్టి తుమ్మమొద్దు. చదువుకు వాడికీ చుక్కెదురు.

"ఏడ్చావ్. అడ్డగాడిదలా తిరిగే నీకేం తెలుస్తాయి సెంటిమెంట్స్" మనసులో అనుకున్నదే కాని ఆ మూర్ఖుడితో అనలేదు. 'ఊ!' అని మందలింపుగా అని ముందుకు నడిచింది.

మరి కాస్సేపట్లో పార్వతి కాలేజీ గేటుముందు రిక్షా దిగింది.

పుస్తకాలు తీసుకొని విద్యార్థినిగా ఆ కాలేజీలోకి అడుగు బెడ్తుంటే ఆమె శరీరం, మనస్సు ఆనందంతో పులకరించిపోయాయి.

ఎంతో చరిత్రగల కాలేజీ అది.

ముప్పయి సంవత్సరాల క్రితం ఆ కాలేజీలో విద్యార్థినిగా చేరాలని పార్వతి ఉవ్విళ్ళూరింది. కానీ తల్లితండ్రులు అడ్డుపడ్డారు.

పార్వతి సంపన్నుల కుటుంబంలో పుట్టింది.

ఆ వూరికి పది మైళ్ళ దూరంలో ఉన్న ఒక గ్రామానికి ఆమె తండ్రి మకుటంలేని మహారాజులాంటివాడు. దానధర్మాలకు పెట్టింది పేరు వారి కుటుంబం. కావాలనుకొంటే కూతుర్ని పది మైళ్ళు జట్కాలో పంపించి చదువు చెప్పించగల శక్తి ఉంది. కానీ అసలు " స్త్రీకి చదువెందుకు?' అన్న చాదస్తం వదిలితేనా?

"పెళ్ళి కావల్సిన ఆడపిల్లవు. కావాలంటే సంగీతం నేర్చుకోమ్మా. మాస్టర్ని కుదురుస్తాను. కానీ రోజూ పది మైళ్ళు వెళ్ళి రావటం మనలాంటి కుటుంబ స్త్రీలకు తగదు.'

పార్వతి బాధపడింది. ఎదిరిద్దామన్న కోరిక కలిగింది. కానీ అప్పట్లో సాహసం

చేయలేకపోయింది.

పెళ్ళి సంబంధాలు చూస్తున్నప్పుడు మాత్రం సాహసం చేయక తప్పలేదు.

"నాన్నగారూ! కాబోమే నా భర్త సిరిసంపదలకు, కుటుంబ చరిత్రకే మీరు ప్రాధాన్యమిస్తున్నట్లుంది. కానీ నేను విద్యా సంపద కలిగిన భర్తను కోరుకుంటున్నాను. కనీసం ఈ కోరికనన్నా తీరుస్తారా?"

వారు తీర్చలేదు. పెద్దలకు ఎదురుతిరిగి మొండికేసి తన కోరిక తీర్చుకొంది. విద్యాసాగర్‌ను పెళ్ళి చేసుకొంది.

"నాకు చదువుకోవాలన్న కోరిక ఉందండీ! మా నాన్న దాన్ని తీర్చలేకపోయాడు. విద్య విలువ తెలిసిన విద్యావంతులు, మీరన్నా నా కోరిక తీర్చరూ?" మొదటి రాత్రే అడిగింది భర్తను.

"చదువుకొని, డిగ్రీలు సంపాదించుకొని ఎవరిని, ఏ విధంగా ఒరగబెడ్తావో కాస్త చెప్పూ?" బండగా అడిగిన భర్త మాటలకు విస్తుపోయింది పార్వతి.

"ఎవరికో ఒరిగించే దేముందండీ. అన్ని ఆర్జనల్లోకీ విద్యార్జన గొప్ప దంటారు కదా? నా తృప్తికోసం, ఆనందంకోసం చదువుతాను."

పేరుకు విద్యాసాగర్. పక్కన తగిలించుకోవటానికి చాలా డిగ్రీలున్నాయి. కానీ సంస్కారం లేదతనికి. విద్యంటే అతనికి అసహ్యం. తన డిగ్రీలు తను కోరిన ఉద్యోగాన్ని సంపాదించపెట్టలేదని కక్ష. ధనార్జనకు ఉపయోగపడని విద్య వ్యర్థమని అతని సిద్ధాంతం. డిగ్రీలు సంపాదించి సంస్కారాన్ని కోల్పోయిన వ్యక్తి అతను.

అతను భార్య కోరికను తీరుస్తాడా?

పైగా ధనం అతనికి పెద్ద భార్య లాంటిది. డబ్బు కోసం కొన్నాళ్ళు భార్యద్వారా అత్తవారిని పీడించాడు.

కానీ చంచల స్వభావంకల సంపద అప్పటికే వారిని వదిలి పారిపోసాగింది. పైగా పార్వతి ఆత్మాభిమానం కలవ్యక్తి. పుట్టింటిని ప్రతిసారి డబ్బు కోసం దేబిరించటం ఆమెకు అసహ్యం.

"అయితే ఏదో కాస్త చదువు చదివేవుగా! ఎలిమెంటరీ స్కూలు టీచరు ఉద్యోగం సంపాదించుకో. మీ వాళ్ళలాగా నేను జమీందారును కానని నీకు తెలుసుగా? ఉత్తుత్త ఆత్మాభిమానాలుండి ఏం లాభంట?"

అప్పటికే పార్వతికి శంకరం పుట్టేడు. కిష్టిగాడు కడుపులో ఉన్నాడు. భర్త ఆర్జన అతని సాదరు ఖర్చులకే చాలటం లేదు.

ఆమెకు భర్త ఆలోచన నచ్చింది. తన కాళ్ళమీద తాను నిలబడటం ఎప్పటికైనా మంచిదే కదా?

"చదువుకొంటానంటే అభ్యంతరం పెట్టి ఉద్యోగంలో చేరమని ప్రోత్సహించటం

మీ జీవిత లక్ష్యాన్ని, సంస్కారాన్నీ చాటిచెప్తున్నదండీ. థాంక్స్!"

ఆమె అప్పుడు ఉద్యోగంలో చేరటం ఎంతో ఉపయోగపడింది. ఎలిమెంటరీ స్కూలు టీచరు ఉద్యోగం ఆమెకు ఆర్థికంగానే కాక మానసికంగా కూడా అండగా నిలబడింది.

తన జీవితం ఇలా కావటానికి తనే బాధ్యురాలు కాదూ?

చదువు వద్దన్నప్పుడు తండ్రిని ఎదిరించవలసింది. డిగ్రీలను చూసి భ్రమపడి, పెద్దల నెదిరించి విద్యాసాగర్‌ను చేసుకోకుండా ఉండవలసింది.

రెండుసార్లు తను పొరపాటు చేసింది. ఏది చెయ్యకూడదో అది చేసింది.

ఆమె రోజూ ఆ కాలేజీవైపు నుంచే వెళ్ళాలి. కాలేజీని చూసినప్పుడల్లా ఆమెకు చదువుకోవాలన్న కోరిక కలిగేది.

తన కోరిక ఎలాగూ తీరదు. కనీసం తన బిడ్డలైనా ఆ కాలేజీలో చదవాలి. బిడ్డల ద్వారా తన కోరిక తీరాలి.

అలా ఆమె ఎన్నిసార్లు అనుకుందో! కానీ...

బెల్లుమోత విని ఆమె ఉలిక్కిపడింది. • ఆలోచన చెదిరింది.

'స్కూల్ ఆఫ్ కరస్పాండెన్స్ కోర్సెస్, ఆంధ్ర విశ్వవిద్యాలయం. కాంటాక్ట్ ప్రోగ్రామ్.'

నీలంరంగు గుడ్డపైన తెల్లటి అక్షరాలు తళతళలాడుతూ ఆమెను ఆహ్వానించాయి.

ఆమె త్వరత్వరగా అడుగు ముందుకు వేసింది.

క్లాస్ రూమ్‌లోకిఅడుగుబెట్టబోతుండగా ఆమె కాళ్ళు సిగ్గుతో కంపించాయి.

తల ఎత్తి ఆమె క్లాస్‌రూమ్‌ను ఒకసారి చూచింది.

గేలరీల సీటింగ్ అరేంజ్‌మెంట్‌తో ఉన్న పెద్దక్లాస్ రూమ్ అది.

విద్యార్థినీ విద్యార్థులతో బల్లలన్నీ నిండి వున్నాయి.

"విద్యార్థినీ విద్యార్థులు!" ఆమె నవ్వుకొంది మనసులో.

పద్దెనిమిదేళ్ళ వయసు నుంచి తనకన్నా హెచ్చు వయసువారి దాకా ఉన్నారా క్లాసులో. తన లాంటి తల నెరిసిన స్త్రీలు ఇంకా కొందరున్నారు.

ఆమెకు ధైర్యం, ఉత్సాహం వచ్చాయి.

వెళ్ళి చివరి బెంచీలలో ఒకదానిమీద కూర్చుంది.

"మీదే వూరు?" పక్కనున్న ముప్పై సంవత్సరాల పడుచు ప్రశ్నించింది.

"యీ వూరే. పేరు పార్వతి. ఎలిమెంటరీ స్కూల్లో హెడ్‌మిస్ట్రెస్ ఉద్యోగం చేస్తున్నాను. ఇద్దరు పిల్లలు."

ముప్ఫయి ఏళ్ళామె తన వివరాలు చెప్పింది. ఆమె పేరు ఫ్లొరెన్స్. ఎక్కడో పల్లెటూరు నుంచి వచ్చింది. బి.ఎ. పాసయితే ఉద్యోగంలో ప్రమోషన్ వస్తుందని బి.ఎ. చదువుతోంది.

"మీకు పాఠాలన్నీ స్కూల్ వాళ్ళనుంచి వచ్చాయా?"

"వచ్చాయి."

"నాకు సగమే వచ్చాయి. చూడండి ఎంత అన్యాయమో?"

"వచ్చినంత వరకూ చదివారా?"

"అప్పుడేనా? కాంటాక్ట్ ప్రోగ్రామ్ అయ్యాక మొదలు పెట్టాలి. ఇంపార్టెంట్ చెప్తారుగా.

పార్వతి నవ్వుకొంది.

ఇంతలో క్లాసులోకి లెక్చరర్ వచ్చాడు. అలా గంటకొకరు చొప్పున వస్తూనే ఉన్నారు. ఇంగ్లీషు తెలుగు చరిత్ర రాజనీతిశాస్త్రం, సామాజికశాస్త్రం. లెక్చరర్లు చెప్పే పాఠాలను ఆమె శ్రద్ధగా వింటోంది.

ఆమె మనసు ఎక్కడో తేలిపోతోంది.

లెక్చరర్లలో కొందరు వృద్ధులున్నారు. మరి కొందరు యువకులే. కొందరు బాగా, మరి కొందరు సుమారుగా చెప్పగలరు. కానీ అందరూ నిశ్చయంగా తనకి తెలియని విషయాలనే చెప్తున్నారు. తెలీని విషయాలని తెలుసుకోవటంలో ఎంత మాధుర్యం ఉంది?

అందరు లెక్చరర్లలోకి ఆమెను చరిత్ర లెక్చరర్ మరింత బాగా ఆకర్షించాడు. చూడబోతే అతనికి శంకరం వయసు కూడా ఉన్నట్లు లేదు. కానీ తన సబ్జెక్టులో ఎంత పాండిత్యం ఉందతనికి? కథలా చరిత్రను ఎంత ఉత్సాహజనకంగా ఆకర్షణీయంగా బోధిస్తాడు!

అతను తన పుత్రుడు అయితే ఎంత బాగుండేది. శంకరం అతనిలా తయారవుతే ఎంత సంతోషించేది.

కానీ శంకరం తన మాట వింటేనా?

వాడిదంతా తండ్రిపోలికే!

"పనికి మాలిన ఈ చదువు లెందుకమ్మా? ఈ డిగ్రీల కోసం వెచ్చించే ధనాన్ని, కాలాన్ని మరో రంగంలో వెచ్చిస్తే బోలెడంత డబ్బు. డిగ్రీలు పట్టుకుని ఉద్యోగాల కోసం వారినీ, వీరినీ దేబిరించడం ఎంత ఇన్‌సల్ట్? చాలీ చాలని జీతాలు, బానిసజాలు రొటీన్ లైఫ్! అలాంటి లైఫ్ అంటే నాకు చికాకు. ఐవాంట్ థ్రిల్. నీ కెందుకు? నేనెలా పైకి వస్తానో చూడు!"

"ఎలా వస్తావు?"

"మహా మహా చదువుకున్న పండితుల్ని కూడా ఈనాడు శాసించగల వారెవరమ్మా? గుమాస్తాలు, ఆఫీసర్లు. వారిని కూడా శాసించగల వారెవ్వరు? రాజకీయ నాయకులు. అవునా? నేను ఆ రూట్‌లో వెళ్తాను. విద్యావంతుల్ని, మేధావుల్ని శాసిస్తాను."

"విద్య పరమార్థం విజ్ఞాన సముపార్జన శంకరం! విద్య మనిషిలో వినయాన్ని,

వివేచనాశక్తిని, సంస్కారాన్ని పెంచుతుంది. అహాన్ని అణిచివేస్తుంది. నువ్వు ఏ రూటులో వెళ్ళి పైకి రావాలన్నా విద్య అవసరం. లేకపోతే నీకు రూట్స్ ఉండవు. ఎక్కడా రాణించవు.

ఆమె బోధన చెవిటివాడి ముందు శంఖ మూదినట్లయింది.

రాజకీయాల రూట్‌లో వెళ్ళి శంకరం మెదటి స్టేజ్‌లోనే ఆగిపోయాడు. స్థానిక నాయకుల అనుచరుల స్థాయి నుంచి పైకి ఎదగలేదు.

"కాలం కర్మం కలిసివస్తే రాజకీయాల్లో పైకి పోవటం ఎంతసేపమ్మా? చూస్తూండు. నా టర్నింగ్ పాయింట్ ఎప్పుడో వస్తుంది."

అదృష్టం మీద ఎంత విశ్వాసం? ఆ విశ్వాసం స్వయం కృషిపైన ఉంటే ఎంత బాగుండును?

ఆ తరువాత కొన్నాళ్ళు కిష్టిగాడిపైన ఆశలు పెట్టుకుంది. అతనూ మరో లైను తొక్కేడు.

"అమ్మా, ఈనాడు డబ్బు, అధికారాల తరువాత ప్రపంచాన్ని శాసిస్తున్నది గ్లామర్. ఈ గ్లామర్ పుష్కలంగా ఉన్నదెవరికో తెలుసా? సినిమా స్టార్స్‌కి. నేను సినిమా స్టార్‌నయిపోతాను. చూస్తూండు."

చిన్నతనంలోనే అలా నిశ్చయించుకుని చదువుకు గంటకొట్టేడు. గుంట తీసి పూడ్చిపెట్టాడు. రంగు పూసుకుని నాటకాలాడసాగేడు.

"రంగు పూసుకున్న వాళ్ళంతా నటులు కాలేరురా. నటులందరూ సినిమాస్టార్స్ కాలేరు. నాటకాలు నీకేం కూడు పెడ్తాయి?"

"కూటికోసం చదవరని నువ్వే చెప్పావు గదమ్మా. నాకు చదువు రాదు. నన్నిలా కళాసేవ చేస్తూ బ్రతకనియ్. ఎప్పుడో సినిమా ఛాన్సురాకపోతుందా?

భర్త అలా-

బిడ్డలు ఇలా-

ఏ ఒక్కరూ తన తపనను అర్థం చేసుకోరు. కోరికను తీర్చలేదు.

"ప్రాచీన భారతీయ సంస్కృతీ వికాసానికి మూలకారణం, విజ్ఞాన తృష్ణ. వేదంలో విద్ అన్నా, బుద్ధ అన్నా, జిన అన్నా, అన్ని పదాల అర్థమూ ఒక్కటే. జ్ఞానం. మనిషిని పశు మృగ లక్షణాల నుంచి వేరుచేసి సంస్కారవంతుడిగా, సత్వమూర్తిగా తీర్చిదిద్దే సాధనం జ్ఞానమని భారతీయ ఋషులు ఏనాడో గ్రహించారు. అందుకే..."

చరిత్ర లెక్చరర్ చెప్తున్నది వింటూనే ఉంది పార్వతి.

'చాలా చక్కగా చెప్పేవు నాయనా. కానీ విద్య పరమార్థాన్ని గుర్తించే వారెంతమంది ఉన్నారు? నీలాగా చెప్పేవారు మాత్రం ఎవరున్నారు? నా ఆయుస్సు కూడా పోసుకుని నూరేళ్ళు చల్లగా వర్ధిల్లు నాయనా!"

అతన్ని ఆమె తల్లి మనసు దీవించింది.

✡ ✡ ✡

కాంటాక్ట్ ప్రోగ్రామ్ తొమ్మిది రోజులు తొమ్మిది సెకండ్లుగా గడిచిపోయాయి పార్వతికి. ఏదో కొత్త ప్రపంచంలో, విజ్ఞాన ప్రపంచంలో ఉన్నట్లుంది. శరీరానికి మనసుకి ఎంత హాయి? ఏమి ఆరోగ్యం? ఇవాళ ఆఖరి రోజు.

రేపటి నుంచి మళ్ళీ ఇల్లు, పిల్లలు, ఏవేవో తాపత్రయాలు, మనస్తాపాలు.

"అమ్మా ఈ వయసులో నువ్వలా కాలేజీకి వెళ్తుంటే మాకెంత నగుబాటుగా ఉందో తెలుసా? ఇరుగు పొరుగు వాళ్ళు ఏమనుకొంటున్నారో తెలుసా?" ఆమె కాలేజీకి బయలుదేరే సన్నాహంలో ఉండగా శంకరం సీరియస్‌గా అడిగాడు.

ఆమెకు అవన్నీ తెలుసు. అయినా తెగించి చేరింది. ఎందుకు?

ఈ వయసులో విద్యార్జన పట్ల తనకు గల శ్రద్ధ కొడుకులకు ప్రేరణ కావాలన్న లక్ష్యంతో. జీవిత విలువల పట్ల వారికి సదవగాహన కలగాలన్న కాంక్షతో.

కాని ఇదేమిటి?

ఏమనుకొంటున్నాడు శంకరం? కొడుకులు చేయాల్సిన పని తల్లి చేస్తున్నదనా?

"కాదు. ఏభై ఏళ్ళు నిండినా పార్వతమ్మ పదహారేళ్ళ పిల్లననే అనుకొంటున్నదని.'

"నిజమేరా? అందులో తప్పేముంది? వయసు వచ్చింది శరీరానికే కాని మనసుకూ, బుద్ధికి కాదు. అవి ఇంకా యౌవనంతో చైతన్యవంతంగానే ఉన్నాయి. అందుకే జ్ఞానతృష్ణ చావలేదు. మరి మీకో? శరీరం యవ్వనంతో ఉంది. మనసుకీ, బుద్ధికి వృద్ధాప్యం వచ్చేసింది.'

"ఆపమ్మా. జ్ఞానం జ్ఞానం! ఇప్పుడు జ్ఞానాన్ని సేకరించి ఎవరిని ఉద్ధరించాలమ్మా"

"కన్నబిడ్డలనే ఉద్ధరించుకోలేని నేను ఇంకెవరినో ఏం ఉద్ధరించగలనురా? నన్ను నేను ఉద్ధరించుకొంటాను."

"వాదనలు వద్దమ్మా. ఈ సంవత్సరానికి అయిందేదో అయిపోయింది. ఇంతటితో ఈ చదువుకు స్వస్తి చెప్పు."

నవ్వొచ్చింది పార్వతికి. తను, వాళ్లనిచదువుకునేలా చేయాలని ప్రయత్నిస్తుంటే, వాళ్ళు తనని చదువు ఆపేయమంటున్నారు.

"ఏమ్మా? నా మాటలు నవ్వు తెప్పిస్తున్నాయా?

"నా జీవితమే నవ్వుగా ఉంది రా నాయనా! సరే నీ కోరిక చెప్పేవు కదా? మరి నా కోరిక కూడా ఒకటి ఉంది. తీరుస్తావా?

శంకరం మాట్లాడలేదు.

"భయపడకు. చదువుకోమననులే. కానీ ఇవాళ కాలేజీలో వీడ్కోలు ఉత్సవం జరుగుతోంది. నీ తమ్ముడితో సహా దానికి రాగలవా?

"ఇంతోసి పది రోజుల చదువులకి ఫేర్‌వెల్ పార్టీ కూడానా?"

ఎగతాళి...ఎగతాళి!

"అలాగే వస్తానమ్మా. తమ్ముడిని తీసుకుని వస్తాను. పార్టీయేనా? ఫొటో కూడా ఉన్నదా?"

✡ ✡ ✡

పార్టీకి ముందు ఫొటో తీయించుకున్నారంతా. ఆ తరువాత జరిగిన సభకు కరస్పాండెన్స్ కోర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అధ్యక్షత వహించాడు.

శంకరం, కిష్టుకు అదంతా చిత్రంగా ఉంది.

తమ తల్లి కన్నా పెద్ద వయసు ఉన్నవారు ఉన్నారు విద్యార్థుల్లో. అందరూ తమ వయసును మరిచిపోయి విద్యార్థుల్లా ఉత్సాహంగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆనందంగా మాట్లాడుకుంటున్నారు.

అందరిలోకి బాగా ముసలి వ్యక్తిని పట్టుకున్నాడు శంకరం.

"సర్. మీరేం ఉద్యోగం చేస్తున్నారు?"

ఆయన అతని వైపు అదో విధంగా చూసి నవ్వాడు.

"ఇప్పుడేం లేదు. ఇటీవలే ఉద్యోగంలో నుంచి రిటైరయ్యాను".

"మరి ఇప్పుడు చదువుకోవటం వల్ల మీకేం లాభం ఉంది?"

అతను మళ్ళీ నవ్వి "అది నీ కర్థం కాదులే నాయనా" అంటూ వెళ్ళిపోయాడు.

"ఈయనెవరో మా అమ్మకు డిటోగాడిలా ఉన్నాడు" అనుకుంటూ శంకరం మరో నలుగురిని కదలించాడు.

ఆ నలుగురూ ఒక్కొక్కరూ ఒక్కొక్క లక్ష్యంతో చదువుతున్నారు.

ఉద్యోగాన్ని ఆశించి, ప్రమోషన్ ఆశతో, పేరుకు చివర డిగ్రీని తగిలించుకొందామన్న కోరికతో, తన వాళ్ళంతా డిగ్రీ హోల్డర్సు అయి తను కాదన్న కొరతతో.

అయితే వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొందామన్న కోరిక అందరికీ ఉంది. అందరికీ పాసుకావాలన్న తపన ఉంది. పట్టుదల ఉంది.

శంకరానికి మతిపోయింది. తల్లి వైపు చూశాడు.

పార్వతి అల్లంత దూరంలో కూర్చొని ఉంది. యోగదీక్షలో ఉన్నదానిలా, తపస్వినిలా!

తమ్ముడితో సహా తనని ఆ పార్టీకి ఎందుకు రమ్మన్నదో శంకరానికి కాస్త కాస్తగా బోధపడసాగింది.

"ఇప్పుడు విద్యార్థినీ, విద్యార్థులు ప్రసంగిస్తారు. ముందుగా శ్రీమతి పార్వతీ దేవి."

పార్వతి నెమ్మదిగా లేచి వేదిక వద్దకెళ్ళింది. వేదిక నెక్కబోతుంటే ఆనందంతో ఆమె కాళ్ళు తడబడ్డాయి.

"అధ్యక్షుల వారికి, గురువులకీ, సోదర విద్యార్థినీ, విద్యార్థులకూ అందరికీ నమస్కారం.

నా వయసు ఏభై రెండేళ్ళు. డిగ్రీ పూర్తి చేసేసరికి ఏభై అయిదు వస్తాయి. అయినా నేనీ కరస్పాండెన్స్ కోర్సులో ఏ ప్రయోజనాన్ని ఆశించి చేరాను?

చిన్నతనంలో చాలామందికి తిండి రంధి ఉంటుంది. కానీ నాకు చదువు రంధి ఎక్కువగా ఉండేది. అయినా నేను ఎక్కువగా చదువుకోలేకపోయాను. పెళ్లికి ముందు తల్లిదండ్రులు, పెళ్ళయ్యాక భర్త ప్రతిబంధకాలయ్యారు.

నా కోరికను బిడ్డల ద్వారా తీర్చుకుందామనుకున్నాను. బిడ్డలూ సహకరించలేదు.

అయినా చిత్రం! ప్రతి ఓటమితో నాలో కోరిక పెరిగింది. వయసుతో పాటు విజ్ఞాన తృష్ణ తీవ్రం కాసాగింది. అయితే తీర్చుకోవడానికి మార్గం ఏదీ? సంసారపు ఊబిలో మొలలోతున ఇరుక్కుపోయిన స్త్రీని కదా నేను?

ఈ స్థితిలో కరస్పాండెన్స్ కోర్సు నాకు వరప్రసాదిలా వచ్చింది.

దానిలో చేరుదామంటే బిడ్డల వ్యతిరేకత. ఇరుగు పొరుగు వారి నుంచి ఎత్తిపొడుపులు. అయినా తెగించి చేరాను. లెసన్స్ అన్నీ చదివాను.

ప్రపంచంలో ఎంత విజ్ఞాన సంపద ఉంది?

అందులో కొంతన్నా సంపాదించుకోకుండా ధనార్జన కోసం తాపత్రయపడుతూ మనుష్యులు నిజమైన సంపదను ఎంత నష్టపోతున్నారు?

కాంటాక్ట్ కోర్సులో గురువులు చెప్పిన పాఠాలు విన్నాక ఆ భావం నాలో ధ్రువపడింది. మాకు పాఠాలు చెప్పిన గురువులందరూ సమర్థులే. కానీ వారిని గురువులనుకుని పూజించాలో, నా బిడ్డలనుకొని గర్వించాలో నాకు అర్థం కావటం లేదు.

అందులో ముఖ్యంగా చరిత్ర లెక్చరర్ గారు, వయసులో మా శంకరం కన్నా తక్కువ ఈడువాడు. అయినా ఎంత విజ్ఞానం? మనదేశ ప్రాచీన సంస్కృతీ సంపద విశిష్టతను ఎంత గొప్పగా చెప్పారు. వయసు మళ్ళిన నాలాంటి వాళ్ళలో కూడా ఎంత ఉత్తేజాన్ని కలిగించారు?

ఆగురువుగారికి నమస్కరించనా? నా బిడ్డఅనుకొని ఆశీర్వదించనా?

నేను చేపట్టిన ఈ విద్యార్జనా యజ్ఞాన్ని మిగతా రెండేళ్ళు కొనసాగిస్తాను. తద్వారా నా మనసుకు తృప్తి లభిస్తుంది. శాంతి కలుగుతుంది. అది నాకు వ్యక్తిగత లాభం.

కానీ అంతకన్నా ఉన్నతమైన పరమార్థాన్ని ఆశించి నేను ఈ కోర్సులో చేరాను.

మన దేశంలో విద్యకు దూరమైనయువతీ యువకులెందరో ఉన్నారు. విద్యను బిజినెస్ గా భావించేవారు కోకొల్లలు. విద్యను ద్వేషించేవారూ ఉన్నారు.

"అలాంటివారిలో ఏ ఒక్కరైనా నన్ను చూసి విద్యార్జనపట్ల ప్రేమను పెంచుకోవాలన్నదే నా ఆశ."

క్లాస్‌రూమ్ చప్పట్లతో మారుమోగిపోయింది.

"అమ్మా"!

వేదిక దిగబోతున్న పార్వతి ఆగి ఆశగా శంకరం వైపు చూసింది. శంకరం

మారిపోయి పశ్చాత్తాపంతో తనను పిల్చాడన్న భ్రమ! అతను తల వంచుకున్నాడు. ఆమె నిరాశతో క్రుంగిపోయింది. "అమ్మా" మళ్ళీ ప్రేమగా పిలుపు. ఎంత తియ్యగా ఉందా పిలుపు. వెనక్కి తిరిగి చూస్తే చరిత్ర లెక్చరర్!

"నేనమ్మా. మీబిడ్డనేనమ్మా. నాకు అక్షరాభ్యాసం చేయించిన గురువులు మీరు. చదువుకోకుండా మెండికేస్తే, తల్లిలా ప్రేమతో,నాకు చదువుపట్ల ప్రేమను, గౌరవాన్ని కలిగించిన గురువులు. గురువు అన్న వ్యక్తి ఎలా ఉండాలోచిన్నతనంలో నాకు నేర్పిన పరమగురువులు మీరు. గుర్తు పట్టలేదామ్మా నన్ను? అది సహజం. కానీ గురువు చేత ప్రభావితుడైన శిష్యుడు గురువును జీవితాంతం మరిచిపోడమ్మా. నేనమ్మా. శేఖరాన్ని! చిన్నప్పుడు మీ శంకరం చేత తన్నులు తిన్న శేఖరాన్ని. నా గురువు నుంచి పొగడ్తలు, ఆశీస్సులు పొంది ఈ రోజు నా జీవితం ధన్యమయిందమ్మా. నా గురుభక్తిని తెలుపుకోనీయండి!

అతనామె పాదాలకు నమస్కరించాడు. తనకు వేసిన పూలమాలను ఆమె పాదాలపైన ఉంచాడు.

"శేఖరం ...నువ్వు ...నువ్వు...నువ్వేనా? ఇంత గొప్ప గురువు వయ్యావా నాయనా! నీలాంటి శిష్యుడిని, గురువుని కూడా పొందిన నా జీవితం కూడా ఈనాడు ధన్యమయింది నాయనా!" ఆమె మనసు, శరీరం పారవశ్యం చెందాయి.

ఇంతలో శంకరం, కిష్టులు గుర్తుకొచ్చారు. వారిని మార్చాలన్న తన ఈ చివరి ప్రయత్నం కూడా విఫలమైనట్లేనా?

ఆమెకు నీరసం కమ్మింది. కళ్ళు తిరిగాయి.

"అమ్మా, మమ్మల్ని క్షమించమ్మా. చదువెందుకో తెలుసుకున్నాము. సంస్కారాన్ని పెంచుకొంటాముగా?"

స్పృహ తప్పి పడిపోతున్న ఆమె మీద ఆ మాటలు అమృత బిందువుల్లా పనిచేశాయి.

ఆంధ్రప్రభ వారపత్రిక 1-4-87